




- ప్రభుత్వ దవాఖానల్లో మెరుగైన వైద్యసేవలు
- అందుబాటులో అధునాతన పరికరాలు
- వైద్యసేవల్లో అవార్డులు అందుకుంటున్న బాన్సువాడ దవాఖాన

# ఆరోగ్యమస్తు

బాన్సువాడ, డిసెంబర్ 1: ప్రజా ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం సర్కారు దవాఖానల ద్వారా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నది. ప్రభుత్వ దవాఖానల్లో అన్ని వసతులు సమకూర్చడంతో కార్పొరేట్‌కు దీటుగా రోగులకు సేవలు అందిస్తున్నాయి. సమైక్య పాలనలో సర్కార్ దవాఖాన అంటేనే గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలు జడుసుకునేవారు. సరైన వైద్య పరికరాలు, వైద్యులు లేకపోవడంతో రోగులు కొట్టుమిట్టాడేవారు. దవాఖానకు వెళ్తే పట్టించుకునే వారే కరవయ్యేవారు. స్వరాష్ట్రంలో పరిస్థితి మారింది. నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు అన్న రోజులు పోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రావడంతో సర్కార్ దవాఖానలు అంటేనే నాణ్యమైన వైదానికి చిరునామాగా మారాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత వైద్యారోగ్యశాఖలో అనేక సంస్కరణలకు కేసీఆర్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అంచెలంచెలుగా సమూలా మార్పులు తెచ్చింది. విప్లవాత్మక మార్పులు రావడంతో ప్రభుత్వ దవాఖానలు అంటేనే ప్రజల్లో పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్యం అందుతుందనే భరోసా ఏర్పడింది. ఆధునాతన పరికరాలతో వైద్య సేవలు అందిస్తుండడంతో 'నేను వస్త బిడ్డో సర్కార్ దవాఖాన'కు అంటూ తరలివస్తున్నారు.

**కార్పొరేట్ వద్దు.. సర్కారు ముద్దు**

తెలంగాణ ఏర్పడిన తర్వాత కేసీఆర్ పాలనలో పదేండ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో బాన్సువాడ ప్రభుత్వ దవాఖాన రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలుస్తున్నది. కార్పొరేట్‌కు దీటుగా సేవలు అందిస్తుండడంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను కైవసం చేసుకుంటున్నది. ఒకప్పుడు అత్యవసర పరిస్థితుల్లో దూర ప్రాంతాలైన నిజామాబాద్, హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలకు తీసుకెళ్లాలని చెబుతుంటే వారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. బాన్సువాడ ప్రాంతంతోపాటు చుట్టుపక్కల నియోజకవర్గాల ప్రజలు ఇక్కడికే వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. దవాఖానకు ప్రతిరోజూ సుమారు 600 నుంచి 800 మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.


**అందుబాటులో అధునాతన పరికరాలు**

బాన్సువాడలోని ప్రభుత్వ వందపడకల మాతాశిశు దవాఖానకు అనుసంధానంగా ఉన్న ప్రభుత్వ ఏరియా దవాఖానలో అత్యవసర పరిస్థితుల్లో వచ్చే వారికి అధునాతన వైద్య పరికరాలతో వైద్యం అందించేలా అన్ని వసతులు ఏర్పాటు చేశారు. దవాఖానలో స్కానింగ్, రక్తనిధి, ఎస్ఎన్‌సీయూ, డయాలసిస్ కేంద్రాలను అందుబాటులో ఉంచారు. ఆక్సిజన్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

## బాన్సువాడ దవాఖానకు అవార్డుల పంట

వైద్యులు , సిబ్బంది అందిస్తున్న మెరుగైన వైద్య సేవలకు గాను బాన్సువాడ దవాఖాన జాతీయస్థాయిలో ఖ్యాతి గడించింది. 2017లో ఆరోగ్యశ్రీలో ఆదర్శ దవాఖానగా అవార్డు సాధించింది. ఇప్పటి వరకు ఆరుసార్లు కాయకల్ప అవార్డులు వరించాయి. 2019 నుంచి 22 వరకు వరుసగా మూడు సార్లు లక్ష్య అవార్డుకు ఎంపిక కావడం గమనార్హం. 2022-23 సంవత్సరంలో బ్రెస్ట్ ఫీడింగ్ ఫ్రెండ్లి దవాఖానగా ఎంపికై జాతీయస్థాయిలో అవార్డు సాధించింది.





## అందరి కృషితోనే అవార్డులు



బాన్సువాడ దవాఖానకు వరుసగా పదుల సంఖ్యలో అవార్డులు వచ్చాయి. వైద్య విధానంలో మార్పులు, అధునాతన వైద్య పరికరాలతో వైద్య సేవలు అందిస్తున్నాం. దవాఖానకు వచ్చే వారికి వైద్య సిబ్బంది మెరుగైన సేవలు అందిస్తున్నారు. దీంతో ప్రభుత్వ దవాఖానలపై ప్రజలకు విశ్వాసం పెరిగింది.

**-డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, బాన్సువాడ దవాఖాన సూపరింటెండెంట్**

## అన్ని వసతులు ఉన్నాయి..



సర్కారు దవాఖానలో అన్ని వసతులు ఉన్నయి. ఎప్పుడుపోయినా డాక్టర్లు ఉంటరు. ప్రాణం బాగోలేదని పోతే చాలా మంచిగ సూస్తరు. బాన్సువాడ దవాఖానలో స్పీకర్ పోచారం సారు దయతో మంచి సౌలవుతులు ఉన్నాయి.

**-పారవ్వ, కొల్లూర్**

# సత్తా చాటిన ఓటరు



**ఉమ్మడి జిల్లాలో** ఓటర్లు చైతన్యాన్ని చాటారు. తమకు ఉన్న ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేందుకు ఉత్సాహం కనబరిచారు. పల్లె పల్లెన ఉద్యమ స్ఫూర్తి రగిలించిన ఉమ్మడి జిల్లా ఇందూరు.. ఇప్పుడు ఈ సార్వత్రిక ఎన్నికల్లోనూ పోటాపోటీగా ఓటింగ్‌లో పాల్గొని తమ సత్తాచాటింది. ఓట్ల పండుగలో పాల్గొని స్ఫూర్తిగా నిలిచారు.

- చైతన్యం చాటిన మహిళలు
- ఓటింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళా లోకం
- ఉదయం నుంచే బారులు తీరి.. స్ఫూర్తిగా నిలిచిన వైనం
- భారీగా ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్న మహిళా మణులు
- కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో పెరిగిన పోలింగ్ శాతం
- పట్టణాలకన్నా పల్లెల్లోనే అధికం..

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 1 : కామారెడ్డి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన పోలింగ్‌లో ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే బారులు తీరారు. ఉత్సాహంతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం తక్కువ మంది ఓటర్లు రాగా మధ్యాహ్నం నుంచి పోలింగ్ ముగిసే వరకు తండోపతండాలుగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో గెలిపించాలని పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు తరలారు. గతంలో ఎన్నడూలేని విధంగా కామారెడ్డిలో ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటర్లు ఉత్సాహం చూపడం గమనార్హం. జిల్లా వ్యాప్తంగా 791 పోలింగ్ కేంద్రాల్లో 79.92 పోలింగ్ శాతం నమోదైంది.

**గంపగుత్తగా బీఆర్ఎస్‌కే అని ఆ పార్టీ ధీమా...**

ఉమ్మడి జిల్లాలో గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది. ఇందులో సింహభాగం ఓట్లు తమకే అనుకూలమని బీఆర్ఎస్ భావిస్తున్నది. గంపగుత్తగా ఇవన్నీ కారు గుర్తుకే పడ్డాయనే విశ్వాసాన్ని ఆ పార్టీ శ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు కొండంత అండగా నిలిచాయి. దీంతో తమ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.


## నిజామాబాద్ జిల్లాలో 74.68 శాతం పోలింగ్

నిజామాబాద్ జిల్లాలో 74.68శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో ఉదయం వేళ చిరుజల్లులు కురవడంతో కొన్ని ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు ఆలస్యంగా చేరుకున్నారు. అన్ని నియోజకవర్గాల్లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి ఓటింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. సాయంత్రం ఐదు గంటల వరకు క్యూలో నిల్చొని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**నియోజకవర్గాల వారీగా పోలింగ్ శాతం**

ఆర్మూర్ నియోజకవర్గంలో 76.02 శాతం, బోధన్‌లో 77.92 శాతం,

నిజామాబాద్ అర్బన్‌లో61.66, బాల్కొండలో 79.72 శాతం, బాన్సువాడలో 81.29 శాతం, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో 76.43 శాతం పోలింగ్ నమోదైంది.




## కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 79.92 శాతం పోలింగ్

కామారెడ్డి జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో 791 పోలింగ్ కేంద్రాల్లో 79.92 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో మొత్తం 6,72,953 మంది ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 3,27,001, స్త్రీలు 3,45,915, ఇతరులు 37 మంది ఉన్నారు. ఇందులో 5,37,794 పురుషులు, 2,58,722 మంది స్త్రీలు 2,79,063,ఇతరులు 9 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

**కామారెడ్డి నియోజవర్గంలో 75.58శాతం పోలింగ్..**

కామారెడ్డి నియోజకవర్గంలో 2,52,460 మంది ఓటర్లకు పురుషులు 1,22,019, స్త్రీలు 1,30,417, ఇతరులు 24 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 89,936, స్త్రీలు 1,00,866, ఇతరులు 9 మంది మొత్తం 1,90,811 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.కామారెడ్డి నియోజకవర్గంలో 75.58 శాతం పోలింగ్ నమోదు అయింది.

**ఎల్లారెడ్డిలో 83.17శాతం**

ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 2,20,531 మంది ఓటర్ల ఉన్నారు.ఇందులో పురుషులు 1,06347,స్త్రీలు 1,14,181,ఇతరులు ముగ్గురు ఉన్నారు. పురుషులు 87,212, స్త్రీలు 96,202 మంది మొత్తం 1,83,414 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 83.17 పోలింగ్ శాతం నమోదైంది.

**జుక్కల్‌లో 81.87శాతం..**

జుక్కల్ నియోజకవర్గంలో 1,99,962 మంది ఓటర్ల ఉన్నారు.ఇందులో పురుషులు 98,635,స్త్రీలు 1,01,317,ఇతరులు 10 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 81,574,స్త్రీలు 81,995 మంది మొత్తం 1,63,569 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.జుక్కల్ నియోజకవర్గంలో 81.87 పోలింగ్ శాతం నమోదుకావడం గమనార్హం.

జిల్లాలో అత్యధికంగా ఎల్లారెడ్డిలో 83.17 పోలింగ్ శాతం నమోదైంది.



